మొబైల్‌లోనూ టెట్ దరఖాస్తుల సవరణ

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : టెట్ దరఖాస్తులను మొబైల్‌ఫోన్‌లోనూ ఎడిట్ చేసుకొనేందుకు విద్యాశాఖ అవకాశం కల్పించింది. ఇది వరకు కంప్యూటర్లు, డెస్క్‌టాప్‌లపైనే దరఖాస్తులను సవరించుకొనే వీలుండేది. కానిప్పుడు మొబైల్‌ఫోన్‌లో ఎడిట్ చేసుకొనే వెసులుబాటు కలిగింది.

కేటీపీపీలో విద్యుత్తు ఉత్పత్తికి బ్రేక్

గణపురం, ఏప్రిల్ 12 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంట్‌లో శుక్రవారం విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. సాంకేతిక లోపంతో బాయిలర్ ట్యూబ్‌లు లీకేజీ కావడంతో ఉత్పత్తి నిలిచినట్టు తెలిసింది. వేసవిలో ఎండల తీవ్రత వల్ల బాయిలర్ ట్యూబ్‌లు లీకేజీ కావడం పరిపాటిగా మారింది. సాంకేతిక లోపాన్ని సరి చేసేందుకు జెన్‌కో ఇంజినీరింగ్ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

గ్యారెంటీల పేరుతో సర్కార్ నయవంచన

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఫైర్

దుమ్ముగూడెం, ఏప్రిల్ 12: కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసకారి అని, కేవలం మోసాలతోనే ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. ఆరు గ్యారెంటీల హామీలను తుంగలో తొక్కి నాలుగు నెలలుగా ఆ పార్టీ చేస్తున్న మోసాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతో లక్ష మెజార్టీతో గెలిచిన మాలోత్ కవితను.. మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, ఆ తరువాత చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే ఆరు గ్యారెంటీలను అటకెక్కించారని విమర్శించారు. తనను మరోసారి ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో సమస్యలపై గొంతెత్తి ప్రశ్నించే అవకాశం ఉంటుందని బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత తెలిపారు.

ఫంగస్‌తో ఉన్న గ్లూకోజ్ బాటిల్

గ్లూకోజ్ బాటిల్‌లో ఫంగస్

- దంతాలపల్లి ప్రభుత్వ దవాఖానలో వెలుగులోకి

దంతాలపల్లి, ఏప్రిల్ 12: ప్రజల ఆరోగ్యం కోసం వినియోగించే గ్లూకోజ్ బాటిల్‌లో ఫంగస్ ఏర్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వెలుగు చూసింది. దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన నర్కుటి సునీత గర్భిణి. కడుపునొప్పి రావడంతో ఈ నెల 5న దంతాలపల్లి ప్రభుత్వ దవాఖానకు వెళ్లింది. ఆ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో దవాఖానలో ఉన్న సిబ్బంది సునీతకు రెండు రకాల గ్లూకోజ్ బాటిళ్లు, మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. ఇంటికి వచ్చిన సునీతకు ఎంతకూ నొప్పి తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు తొర్రూరులోని ఓ దవాఖానకు తీసుకెళ్లారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో దంతాలపల్లి వైద్యశాల నుంచి తీసుకొచ్చిన గ్లూకోజ్ బాటిళ్లను పెట్టిరిచేందుకు శుక్రవారం స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. వాటిలో ఓ బాటిల్ బాగానే ఉండగా, మరో గ్లూకోజ్ బాటిల్ (ఆర్ఎల్)లో ఫంగస్ కనిపించింది. ఫంగస్ ఏర్పడిన గ్లూకోజ్ బాటిల్ ఇచ్చిన డాక్టర్, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బాధితురాలి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

నైట్‌డ్యూటీలపై గురుకులాల్లో రచ్చ

- ఉపాధ్యాయులు, అధికారుల నడుమ వివాదం
- ఉత్తర్వులతో సంబంధంలేదన్న అకడమిక్ అధికారులు
- వారికి తెలియకుండానే జనరల్ అధికారుల నిర్ణయం
- వివాదాస్పదం అవుతున్న సొసైటీ సెక్రటరీ ఉత్తర్వులు
- విద్యార్థుల సంక్షేమ కోసమే అంటున్న గురుకుల సంస్థ

హైదరాబాద్, ఏప్రిల్12 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో నైట్‌డ్యూటీల అంశం వివాదాస్పదమవుతున్నది. ఉపాధ్యాయులు, అధికారుల నడుమ రచ్చకు తెరలేపింది. ఉపాధ్యాయవర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో సొసైటీలో కొందరు అధికారుల తీరుపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని నివారించి ఆత్మహత్యలను నిరోధించాలనే చర్యల్లో భాగంగా నైట్‌డ్యూటీ టీచర్ల సంఖ్యను 2 నుంచి నాలుగుకు పెంచుతూ గురుకుల ప్రిన్సిపాల్స్, ఆర్సీవోలకు గురుకుల సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి ఇటీవల ప్రత్యేకమైన ఉత్తర్వులను జారీ చేశారు. రెగ్యులర్ టీచర్లు అందుబాటులో లేకుంటే పార్ట్ టైం టీచర్లను కూడా వినియోగించుకోవాలని, ప్రిన్సిపాళ్లు కచ్చితంగా గురుకులంలోనే ఉండాలని, నైట్‌డ్యూటీ టీచర్లు రాత్రంతా మేల్కొని విద్యార్థుల కదలికలను గమనిస్తూ పర్యవేక్షించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే సెక్రటరీ ఉత్తర్వులపైనే గాకుండా, అనుసరించిన విధానంపైనా గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. విద్యా సంబంధిత అంశాలపై నిర్ణయం తీసుకునే సందర్భంలో అకడమిక్ అధికారులను సంప్రదించకుండానే నేరుగా జనరల్ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఉపాధ్యాయవర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

ఆ అధికారి తీరుపై ఆగ్రహం

జనరల్ విభాగంలోని కొందరు అధికారులు కావాలనే కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నదని ఉపాధ్యాయవర్గం ఆరోపిస్తున్నది. ఆ విభాగంలోని ఓ కీలక అధికారి సెక్రటరీని తప్పుదోవ పట్టిస్తూ, తప్పుడు నిర్ణయాలకు పురికొల్పుతున్నారని సొసైటీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా అంశాలపై అధికారులు, ఉపాధ్యాయులు రెండు గ్రూపులుగా చీలిపోయి చర్చించుకుంటున్నారు. వాట్సాప్ గ్రూపులు, వ్యక్తిగత గ్రూపుల్లో రచ్చ రచ్చ చేస్తున్నారు.

విద్యార్థులు, టీచర్ల ప్రయోజనం కోసమే : సొసైటీ

విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రయోజనం కోసమే నైట్‌డ్యూటీ ఉత్తర్వులు ఇచ్చినట్టు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. నైట్‌డ్యూటీల అంశంపై పత్రికల్లో వచ్చిన వార్తాకథనాలపై సంస్థ ఈ మేరకు స్పందించింది. నైట్‌డ్యూటీలు చేసే ఉపాధ్యాయులకు సీసీఎల్ సౌకర్యాన్ని కూడా కల్పించామని , ప్రస్తుత వార్షిక పరీక్షలు పూర్తయ్యేంత వరకే ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొన్నది.

నైట్‌డ్యూటీలనే ఎత్తేయాలి: గురుకుల సిబ్బంది సంఘం

ఉపాధ్యాయులకు నైట్‌డ్యూటీలను పూర్తిగా ఎత్తేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, సిబ్బంది సంఘం డిమాండ్ చేస్తున్నది. నైట్‌డ్యూటీల కోసం అదనంగా సిబ్బందిని నియమించుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, కోశాధికారి మధూకర్, నేతలు బాలకృష్ణ, శ్రీనివాసశర్మ, సుధాకర్, డేవిడ్, ప్రసాద్, అశోక్‌రెడ్డి, పద్మ, లింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో సొసైటీ అధికారులకు సూచించారు. టీచర్లను రాత్రి కాపలాదారులుగా మార్చడం తగదని హితవు పలికారు.

గురుకులాల రూటే సపరేటు!

- వేసవిలోనూ తరగతుల నిర్వహణ
- ఇంటర్ బోర్డు ఆదేశాలను పట్టించుకోని సొసైటీలు
- విద్యార్థులు, అధ్యాపకులు సతమతం

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంటర్మీడియట్ బోర్డు, గురుకుల సొసైటీలు పరస్పర విరుద్ధ మార్గాల్లో పయనిస్తున్నాయి. ప్రస్తుత వేసవిలో ఇంటర్ తరగతులు, అడ్మిషన్లను నిర్వహించవద్దని, 2024-25 విద్యా సంవత్సరానికి తరగతులను జూన్ 1 నుంచే ప్రారంభించాలని ఇటీవల బోర్డు జారీ చేసిన ఆదేశాలను గురుకుల సొసైటీలు తుంగలో తొక్కుతున్నాయి. బోర్డు ఆదేశాలకు విరుద్ధంగా తరగతులను నిర్వహిస్తుండటంతోపాటు అడ్మిషన్లను కూడా చేపడుతున్నాయి. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇంటర్ పరీక్షలు గత నెల 14న ముగియడంతో మే చివరిదాకా బోర్డు సెలవులు ప్రకటించింది. ఈ సెలవులు ముగిశాకే ఇంటర్ కాలేజీలను పునఃప్రారంభించాలని స్పష్టం చేసింది. కానీ, గురుకుల సొసైటీల్లో ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు (సీవోఈ) ఉన్నాయి. వాటిలో చదివే విద్యార్థులకు ఇంటర్ విద్యతోపాటు సమాంతరంగా జేఈఈ, నీట్ కోచింగ్ ఇస్తున్నారు. దీన్ని సాకుగా చూపుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల సొసైటీలు ఇప్పటికీ తరగతులను నిర్వహిస్తున్నాయి. ఇంటర్ ఫస్టియర్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు మే 15 వరకు తరగతులు కొనసాగించాలని సంబంధిత ఆర్సీవోలు, కాలేజీ ప్రిన్సిపాళ్లకు గురుకుల సొసైటీ ఆదేశాలను జారీ చేసింది. మరోవైపు సీవోఈల్లో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను ఇటీవల ప్రకటించిన సొషల్ వెల్ఫేర్ సొసైటీ.. ఇంటర్ బోర్డు ఆదేశాలకు విరుద్ధంగా అడ్మిషన్లు కొనసాగిస్తున్నది.

మానసిక ఒత్తిడిలో విద్యార్థులు

సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో ఇటీవల పలువురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. అందుకు మానసిక ఒత్తిడే ప్రధాన కారణమని ఉపాధ్యాయులు చెప్తున్నారు. అయినప్పటికీ సొసైటీ తన తీరును మార్చుకోకపోవడం, ఇంటర్ విద్యార్థులకు విశ్రాంతి ఇవ్వకుండా తరగతులను కొనసాగిస్తుండడంపై ఉపాధ్యాయ సంఘాలే విమర్శలు గుప్పిస్తున్నాయి.

సిలబస్ పూర్తి చేయడమే లక్ష్యం

జేఈఈ, నీట్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలంటే ఇంటర్ సిలబస్‌ను అక్టోబర్ నాటికే పూర్తి చేయాల్సి ఉంటుందని గురుకుల సొసైటీ అధికారులు వాదిస్తున్నారు. అప్పుడే ఆయా ప్రవేశ పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించే అవకాశముంటుందని అంటున్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సీవోఈల్లో వేసవిలోనూ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్తున్నారు.

వయో పరిమితిపై అసత్య ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వయో పరిమితిని 61 ఏండ్లుగా లేదా 33 ఏండ్ల సర్వీసుగా నిర్ధారించారంటూ వివిధ వార్త పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు నిజం కావని ప్రభుత్వం తెలిపింది. ఈ అంశంపై ప్రభుత్వ స్థాయిలో ఏ విధమైన ప్రతిపాదన కాని, ఫైల్ కానీ లేదని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇలాంటి అవాస్తవ వార్తలు ప్రచురించే, ప్రచారం చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని తెలిపింది.

ఇథనాల్ పరిశ్రమ వద్దంటూ ఆందోళన

బెజ్జంకి, ఏప్రిల్ 12: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం పోతారం శివారులో 'వైట్ ఫీల్డ్ బయో ప్రొడక్ట్స్' కంపెనీ నిర్మాణం చేపట్టవద్దంటూ పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. కంపెనీ నిర్మాణం కోసం భూమిపూజ చేస్తున్నారని తెలుసుకున్న నర్సింహుల పల్లి, ముత్తన్నపేట, శంకర్‌నగర్ గ్రామస్థులు శుక్రవారం పోతారం శివారుకు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. కాగా పోలీస్ పహారాలో కంపెనీ యజమానులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని, తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పనులు ఆపకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రైస్‌మిల్ యజమానిపై నాన్‌బెయిలబుల్ కేసు

నారాయణపేట, ఏప్రిల్ 12 : సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయని ఓ రైస్‌మిల్ యజమానిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. ధన్వాడ మండలం కొండాపూర్‌లోని సాయికృష్ణ రైస్‌మిల్‌ను ఇటీవలే కలెక్టర్ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్‌మిల్ యజమాని రాజేందర్ రెడ్డి ప్రభుత్వానికి అందజేయాల్సిన రూ.1.80 కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యాన్ని పక్కదారి పట్టించినట్టు గుర్తించారు. ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించడంతో పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారు.

విద్యా - ఉద్యోగ సమాచారం

సీయూఈటీ–యూజీకి 13 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది సీయూఈటీ–యూజీకి 13,47,618 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకొన్నారు. అయితే, నిరుడుతో పోల్చితే ఈ ఏడాది దరఖాస్తుల తగ్గడం గమనార్హం. నిరుడు 8.03 లక్షల మంది అబ్బాయిలు, 6.96 లక్షల మంది అమ్మాయిలు దరఖాస్తు చేసుకొన్నారు. ఈసారి 7.17లక్షల మంది అబ్బాయిలు, 6.30 లక్షల మంది అమ్మాయిలు దేశవ్యాప్తంగా సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర విద్యాసంస్థల్లోని అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు సమర్పించారు. సీయూఈటీలో మొత్తం మూడు సెక్షన్లు ఉన్నాయి. వీటిల్లోంచి కనిష్ఠంగా 6 సబ్జెక్టుల వరకు విద్యార్థులు ఎంపిక చేసుకోవచ్చు. సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే ఈ ఏడాది అత్యధికంగా ఇంగ్లిష్‌కు 10లక్షలకు పైగా దరఖాస్తులొచ్చాయి. అతి తక్కువ దరఖాస్తులొచ్చిన సబ్జెక్టులు తీసుకొంటే సింధిబాషకు 8, కొంకణి 9, మైథిలి 50, టిబెటన్ 41, ఇటాలియన్ 51, డోగ్రీ 77, రష్యన్ 86, చైనీస్ 93 చొప్పున దరఖాస్తులొచ్చినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) వివరించింది. దేశవ్యాప్తంగా మే 15 నుంచి 31 వరకు సీయూఈటీ (యూజీ) పరీక్షలు నిర్వహించనున్నారు.

అత్యధిక దరఖాస్తులొచ్చిన సబ్జెక్టులివే

సబ్జెక్టు	దరఖాస్తులు
ఇంగ్లిష్	10,07,336
జనరల్ టెస్ట్	8,34,207
కెమిస్ట్రీ	7,01,750
ఫిజిక్స్	6,72,773
గణితం	4,86,365

గీతంలో ఘనంగా విజేతల దినోత్సవం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం.. శుక్రవారం విజేతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ప్రాంగణ నియామకాలలో ఎంపికైన ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, సైన్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సెన్సెస్ విద్యార్థులకు నియామక పత్రాలతో పాటు విదేశాలలో ఉన్నతవిద్య అభ్యసించడానికి సీట్లు పొందిన అభ్యర్థులకు ప్రవేశపత్రాలను అందజేసింది. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు 150 కంపెనీలు బీటెక్, ఎంటెక్, బీబీఏ, బీకాం, బీబీఏ, బీఫార్మసీ, బీఏ విద్యార్థులను ప్రాంగణా నియామకాలకు ఎంపిక చేసినట్టు గీతం వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్ సీతారామయ్య, ప్రొఫెసర్ జీ శివకుమార్, డాక్టర్ మోతహర్ రెజా, డాక్టర్ బందన్ కుమార్ మిశ్రా పాల్గొన్నారు.

గెజిటెడ్ ఆఫీసర్ అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్‌లోని వివిధ గెజిటెడ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 20న ఉదయం 10.30 గంటల నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ అధికారులు తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థుల జాబితాను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు.

15 నుంచి ఏఈఈ అభ్యర్థులకు మెడికల్ టెస్టులు

రాష్ట్రంలోని పలు ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ (ఏఈఈ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 15 నుంచి 22 వరకు ఉస్మానియా దవాఖానలో మెడికల్ పరీక్షలు నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

డిగ్రీలో కొత్తగా బీకాం బీఎఫ్ఎస్ఐ కోర్సు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : వచ్చే విద్యాసంవత్సరం నుంచి డిగ్రీలో కొత్తగా బీకాం బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) కోర్సును ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకొన్నది. ఇందులో బీఎఫ్ఎస్ఐ కన్సార్టియం సహకారంతో మూడేండ్ల డిగ్రీ కోర్సు కరికులాన్ని రూపొందించేందుకు అధికారులు నిమగ్నమయ్యారు.

అవయవదాత ప్రభావం అలాగే..

అందుకున్న వారిలో దాత జ్ఞాపకాలు
అనారోగ్య సమస్యలూ మార్పిడి
అమెరికా పరిశోధకుల అధ్యయనం

న్యూయార్క్:అవయవ మార్పిడికి సంబంధించి అమెరికాలోని కొలరాడో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన పరిశోధకులు కొత్త విషయాన్ని కనుగొన్నారు. అవయవ మార్పిడి జరిగిన 47 మందిపై వీరు అధ్యయనం జరిపారు. ఇందులో దాదాపు సగం మందికి గుండె మార్పిడి జరగగా, మిగతా వారికి ఇతర అవయవాల మార్పిడి జరిగింది. అవయవ మార్పిడి చేయించుకున్న వారిలో 89 శాతం మంది.. సర్జరీ తర్వాత తమలో మార్పులు వచ్చాయని వెల్లడించారు. ఆహారం, సంగీతం, కళల పట్ల తమ అభిరుచులు మారాయని పేర్కొన్నారు. కొందరిలో మతిమరుపు, ఆందోళన, నిరాశ, సైకోసిస్, శృంగార పరమైన సమస్యలు వచ్చాయని తెలిపారు. అవయవాన్ని స్వీకరించిన వారికి వస్తున్న కొన్ని జ్ఞాపకాలు వారి గతానికి సంబంధం లేనివని, అవయవ దాతకు సంబంధించినవని పరిశోధకులు గుర్తించారు.

వెజిటబుల్ వయాగ్రాలా 'బీట్‌రూట్'?

ఏది నిజం? ఏదీ నిజం

ప్రచారం: బీట్‌రూట్.. వెజిటబుల్ వయాగ్రాలా పని చేస్తుందని నెట్టింట ప్రచారం జరుగుతున్నది. స్త్రీ, పురుషుల లైంగిక సామర్థ్యాన్ని ఇది పెంపొందిస్తుందన్న వార్త వైరల్ కావడంతో ఆస్ట్రేలియా సూపర్ మార్కెట్లలో బీట్‌రూట్ కొరత ఏర్పడిందట. యూకేలో టీవీ డాక్టర్ మేఖెల్ మోస్లా బీట్‌రూట్ వయాగ్రాలా పనిచేస్తుందని చెప్పాడంటూ ఓ వార్త వైరల్‌గా మారింది.

వాస్తవం: బీట్‌రూట్ వయాగ్రాలా పని చేస్తుందని డాక్టర్ మోస్లా చెప్పినట్టు కానీ, శాస్త్రీయంగా ఆ విషయం రుజువైనట్లు కానీ ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. బీట్‌రూట్‌లో విటమిన్ బీ, సీ, మినరల్స్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. రక్త ప్రసరణకు ఇవి బాగా దోహదపడతాయి. బీట్‌రూట్ కామోద్దీపనగా పనిచేస్తుందని రోమన్లు నమ్ముతారు. అక్కడ వారు అందుకోసమే బీట్‌రూట్ రసాన్ని సేవిస్తారట. అయితే మనం బీట్‌రూట్ తిన్నప్పుడు, బ్యాక్టీరియా, ఎంజైమ్‌లతో కూడిన రసాయన ప్రతి చర్యలు బీట్‌రూట్‌లోని నైట్రేట్‌ను నైట్రేట్‌గా, తర్వాత నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుస్తాయి. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను విస్తరించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది లైంగిక సామర్థ్యంపై సానుకూల ప్రభావం చూపొచ్చు.

అంతరిక్షంలోకి తెలుగు కుర్రాడు!

బ్లూ ఆరిజిన్ మిషన్ ద్వారా రోదసిలోకి వెళ్లనున్న గోపీచంద్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: మొట్టమొదటి సారిగా ఒక తెలుగు వ్యక్తి అంతరిక్షానికి వెళ్లనున్నాడు. విజయవాడలో పుట్టి పెరిగి అమెరికాలో నివాసముంటున్న గోపీచంద్ తోటకూర(30) ఈ రికార్డును లిఖించబోతున్నాడు. ఎన్ఎస్-25 మిషన్ పేరుతో చేపట్టనున్న అంతరిక్ష యాత్రకు ఆరుగురిని ఎంపిక చేసినట్టు బ్లూ ఆరిజిన్ సంస్థ ప్రకటించింది. ఇందులో గోపీచంద్ తోటకూర ఒకరు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు చెందిన ప్రైవేటు అంతరిక్ష సంస్థ బ్లూ ఆరిజిన్. కాగా, వీరి అంతరిక్ష యాత్రకు ఇంకా తేదీ ఖరారు కాలేదు.

ఎవరీ గోపీచంద్ తోటకూర ?

విజయవాడలో జన్మించిన గోపీచంద్ తోటకూర అమెరికాలో ఆరోనాటికల్ సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. తర్వాత ఆయన కమర్షియల్ జెట్ పైలట్‌గా పని చేశారు. బుష్ ప్లేన్లు, ఏరోబాటిక్ ప్లేన్లు, సీప్లేన్లు, గ్లైడర్లు, హాట్ ఎయిర్ బెలూన్లకు కూడా పైలట్‌గా వ్యవహరించారు. అట్లాంటాలో ప్రిజెర్వ్ లైఫ్ కార్ప్ అనే ఒక వెల్‌నెస్ సెంటర్‌కు గోపీచంద్ సహ వ్యవస్థాపకుడిగా ఉన్నారు. కాగా, ఇంతకుముందు పలువురు భారతీయ మూలాలు ఉన్న వ్యక్తులు అంతరిక్షయానం చేసినప్పటికీ వారంతా అమెరికా పౌరులు. గోపీచంద్ మాత్రం ఇప్పటికీ భారతీయ పౌరుడే. ఆయన వద్ద భారత పాస్‌పోర్టే ఉంది.

దంపతులు కలిసి స్నానం చేయండి

నీటి కొరత నేపథ్యంలో కొలంబియా రాజధాని బొగోటా మేయర్ విజ్ఞప్తి

బొగోటా, ఏప్రిల్ 12: నీటి కొరత నేపథ్యంలో కొలంబియా దేశ రాజధాని బొగోటా ప్రజలకు అక్కడి మేయర్ కార్లోస్ ఫెర్నాండో గలాన్ వింత సూచనలు చేశారు. నీటిని పొదుపు చేసేందుకు గానూ దంపతులు కలిసి స్నానం చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాదు, ఆదివారం లేదా బయటకు వెళ్లేది లేని రోజులను అవకాశంగా తీసుకొని స్నానం చేయడం కూడా మానుకోవాలని ఆయన సూచించారు. బొగోటాలో ప్రస్తుతం నీటి నిల్వలు చరిత్రలో ఎన్నడూ లేనంత తగ్గిపోయిన నేపథ్యంలో ఒక్క చుక్క నీటినీ వృథా చేయవద్దని, కాబట్టి ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం తప్పదని ఆయన పేర్కొన్నారు.

ASIAN | MUKTA CINEMAS A2
Sensation Cinema
DIVE IN TO A Luxurious CINEMA EXPERIENCE
NEWLY RENOVATED
NOW OPEN
2 SCREEN MULTIPLEX
NOW SHOWING
BOOK TICKETS NOW bookmyshow
MAIDAAN (U/A) (2D HINDI) : 4:25 PM, 10:15 PM
THE FAMILY STAR (U/A) (2D TELUGU) : 1:25 PM, 4:15 PM
TILLU SQUARE (U/A) (2D TELUGU) : 10:40 AM, 7:45 PM
MANJUMMEL BOYS (U) (2D TELUGU) : 1:40 PM, 7:30 PM
BADE MIYAN CHOTE MIYAN (U/A) (3D HINDI) : 10:25 AM, 10:30 PM
HARKNESS LASER SCREEN | RECLINER / SOFA SEATING
DOLBY ATMOS | PULSE SOUND | LIVE KITCHEN
Khairtabad, Lakdikapul, Hyderabad
*T & C APPLY

ఖైదీ విడుదల కోసం 34 కోట్ల విరాళాలు

కోజికోడ్, ఏప్రిల్ 12: సౌదీ అరేబియాలో మరణశిక్ష పడిన వ్యక్తిని రక్షించేందుకు కేరళ ప్రజలు ఏకంగా రూ.34 కోట్లను సమీకరించారు. కోజికోడ్‌కు చెందిన అబ్దుల్ రహీమ్ 2006లో సౌదీలో ఓ బాలుడిని హత్య చేశాడనే ఆరోపణపై గల్ఫ్ దేశంలో 18 ఏండ్లుగా జైలు జీవితం గడుపుతున్నాడు. అయితే నష్టపరిహారం చెల్లిస్తే క్షమాభిక్షకు బాలుడి కుటుంబం అంగీకరించింది. దీంతో రహీమ్‌ను ఎలాగైనా రక్షించి విడుదల చేయించటానికి ఏర్పడిన యాక్షన్ కమిటీ ఐదు రోజుల క్రితం దాకా చాలా తక్కువ మొత్తమే సేకరించగల్గింది. ఈ విషయం బాగా ప్రచారం కావటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేరళీయులు అనూహ్యంగా స్పందించారని శుక్రవారం నిర్వాహకులు తెలిపారు.

పూజారుల దుస్తుల్లో పోలీసులా?

- కాశీ విశ్వనాథుడి గుడిలో ఖాకీల డ్రెస్‌కోడ్‌పై సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ ఆగ్రహం

వారణాసి: వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయంలో భక్తుల రద్దీని నియంత్రించడానికి పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయం విమర్శలకు దారి తీసింది. గుడి లోపల పోలీసులను పూజారుల దుస్తుల్లో ఎందుకు నియమించారని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ యూ